కథానిక :

కారెక్కని సత్యం

★

మానవుడు ఆర్థికంగా ఎన్ని అవస్థలు పడుతూన్నా తాను నమ్మిన ఆదర్శాలను మాత్రం వదలకుండా అలాగే పట్టుకుని కూర్చో గలడని తానెన్నడూ విశ్వసించ లేకపోయేడు. మానవుల ప్రవర్తన, ముఖ్యంగా నైతిక ప్రవర్తన, ఆర్థిక అవసరాలమీద ఆధారపడి వుంటుందని తను గాఢంగా విశ్వసిస్తూండే వాడు దీనికి బలీయమైన కారణం వుంది, అది వెంకటేశ్వర్రావులో వచ్చిన మార్పే కూడాను

ఎన్నో సంవత్సరాల తర్వాత మళ్ళీ ఆనాటికి వెంకటేశ్వర్రావు కన్పించేడు పార్కులో అతని కనుబొమలు ముడిపడి వున్నాయి దీర్ఘాలోచన, అతని మునిపంటితో క్రింది పెదాన్ని నొక్కుతూంది

తనని చూడంగానే వక్క క్షణంపాటు క్రింది పెదాన్ని మునిపంటి నొక్కిడినుంచి సడలింపజేసి 'గుడ్ మార్నింగ్ బ్రదర్. కులాసాయేనా' అంటూ తనప్రక్క వొచ్చి కూర్చున్నాడు అతను క్రింది పెదిమ తిరిగి మునిపంటి క్రిందికి వెళ్ళిపోయింది అతని మెదడు ఎవో ఆలోచనల్ని తీసుకోడంతోను, పంపడంతోను 'బిజీ' అయిపోయినట్లుంది

వెంకటేశ్వర్రావుని చూడంగానే తనకి సత్యం గుర్తుకిరాకుండా మానదు వెనకాలే చదువుకునే దినాలు గుర్తుకి వస్తాయి తమ ఆశయాలు, ఆదర్శాలు, నిర్ణయాలు గుర్తుకొస్తాయి సత్య, అహింసలఎడ తమకుండే భక్తి గౌరవాలు, లంచగొండితనం, వ్యభిచారం, అన్యాయం, మొదలైన అవినీతి కరకార్యాలఎడ తమకుండే అసహ్యత గుర్తుకొస్తాయి వాటికోసం వాగ్వివాదాలే కాకుండా కొందరితో తన్నులాడుకున్న దినాలుకూడా లేకపోలేదు - ఆరోజుల్లో!

చదువులయ్యేక ఎవరిదారి వారిదయ్యింది సత్యం ఎక్కడో మద్రాసులో గవర్నమెంటు నౌఖరీలోను, తను వక 'అమెరికను ఫరం'లోను, వెంకటేశ్వర్రావు వాడి చదువుకి తగ్గట్టు తాలూకా ఆఫీసు గుమాస్తాగాను వాళ్ళవూళ్ళోనే చేరేడు తను పెద్ద చదువు చదవకపోయినా, తన అదృష్టంవల్లనయితేనేం, నేర్పువల్ల నయితేనేం, నెలకి రెండు వందలు సంపాదిస్తున్నాడు హాయిగానే వుంది కాని వాళ్ళిద్దరో

'కులాసాయే,' అని జవాబు చెప్పి, తను వెంకటేశ్వర్రావును సాలోచనగా వకసారి నఖశిఖ పర్యంతం చూచేడు వెంకటేశ్వర్రావులో గత రెండేళ్లలోను చాలా మార్పు వచ్చినట్లు కన్పించసాగింది

ముఖ్యంగా తనకి వెంటనే తట్టిన మార్పు; వెంకటేశ్వర్రావు ఏనాడూ యింత ముభావంగా వుండి ఎరుగడు ఆతనిలో యింత ఆలోచనా లేదు ఏనాడూ కూడా. ఆతనిలోని ప్రత్యేక విశేషత, ఎంత కష్టాల్లోనూ నవ్వుతూ హాస్యంగా మాట్లాడుతూండటమే!

తామిద్దరూ వోనాడు వెంకటేశ్వర్రావింట్లో ఎవో ఆ కబుర్లు యీ కబుర్లు చెప్పుకుంటూ సాయంత్రంవరకు కూర్చొని, బయటికి పోదామని లేచేరు తాము గుమ్మం దాటబోతూండగా ఆతని భార్య శారద, వెనకాల్నుంచే చెప్పింది, 'కట్టెలు లేవు, దాన్లో అడితిదగ్గర ఆగి వో 'శలక' పంపించండి' అని

వెంకటేశ్వర్రావు వెనక్కి తిరిగి చిర్నవ్వుతో "ఒక్క శలకేనా ? వేడినీళ్లు కాచుకోడానికి దానికి వుంటాయి, రెండు శలకలు వుండనీ" అంటూనే రోడ్డెక్కేడు తాము అడితీని దాటి వెళ్ళిపోతుండగా తాను గుర్తుచేసేడు 'ఒరే కట్టెల సంగతి మరచిపోయేవురా' అని

వాడు ఓ చిన్న నవ్వు నవ్వేసి "ఎల్లా మరచిపోతారా ? తెల్లారి లేచిందిమొదలు యిల్లాంటి వాటితోటే మెదడులోని శక్తంతా కాలిపోయేది నడు-" అన్నాడు

"మరి కట్టెలు తీసుకోవూ ?" అడిగేడు తను

"ఇంకా నయం వాడే రోడ్డుమీద నుంచి నడవనిస్తున్నాడు ఇప్పుడు కట్టెలు అడిగితే రేపట్నుంచీ అసలు బయట నడవనియ్యడు కూడాను నీకేం పిచ్చేరా . నడు" నవ్వేసేడు

అడితీని దాటిపోయేరు తాము 'మరెట్లా వంటచేస్తుందిరా ?' అడిగేడు తను

'ఏమో ? ఆడవాళ్లకి ఆమాత్రం సర్దుకుని అవస్థపడే స్వభావం దేవుడిచ్చేడు కనకే మనం కొంతవరకు అదృష్టవంతులం అనుకో లేకపోతే మనకొచ్చే 70 రూపాయల జీతంతో యీ సంసారం త్యజించి ఎన్నడో సన్యాసాశ్రమం స్వీకరించేవాళ్లం కాదుటోయి"

తన కాశ్చర్యం వేసేది మనస్సులో బ్రహ్మాండమంత బాధవున్నా చిర్నవ్వుతో మనుష్యులు ఎట్లా మాట్లాడకలరా అని వెంకటేశ్వర్రావుని జూస్తూంటే, అట్లా మాట్లాడటమే కాకుండా యీ యీతిబాధల్ని, సామాన్యకష్టాల్ని అంటించుకోకుండా తామరాకుమీద నీటిబిందువులా వ్యవహరించడం కూడా సాధ్యమే నన్పిస్తుంది

కాని ఆవెంకటేశ్వర్రావులో యిప్పుడా పూర్వపు చిర్నవ్వే లేదు ఆ చిలిపితనమే లేదు ఏదో ప్రపంచం ముంచుకు పోతూన్నట్లు, ఏదో నేరం చేసినట్లు దీర్ఘ చింతనం !

సంసారపు గొడవలు, వుద్యోగంలోని అవస్థలు, బయటనుంచి ప్రపంచాన్ని ముంచుకురాబోయే మూడో యుద్ధంసంగతి అందుబాటులోలేని ధరలు, యిదీ వెంకటేశ్వర్రావు పార్కులో మాట్లాడిన విశేషాలు ఓ పావుగంటలో

మనిషి (*Mental make up*) లోనే కాకుండా, బాహ్యిక వేషధారణలో కూడా వెంకటేశ్వర్రావులో చాలా మార్పుండటం కన్పిస్తూంది

తెల్లటిమల్లెలా మెరుస్తున్న 'లస్ లిన్' షర్టు 'హవానా' పేంట్సు, ఖరీదైన బూట్సు! వీటికితోడు చేతికి కొత్తాచీ, కండ్లకి 'కూలింగ్ గ్లాసెస్'

వింతగా వీటిని చూస్తున్న తనకి గతంలోని వకనాటి విషయం జ్ఞాపకం రాసాగింది తలుచుకోడానికి కూడా తను చాలా సిగ్గుపడాల్సిన విషయం కాని అట్లాంటిదే ఆ సమయంలో గుర్తుకొచ్చింది ఎందుకో తనకి

తను ఏదో పనిమీద ఆరోజునే తిరిగి వచ్చేడు గుంటూరునుంచో, తెనాలినుంచో.

రచన

'శివం'

ఇంటికి వెళ్లి స్నానం చేసుకుని, యిస్త్రీ బట్టలు తొడుక్కుని కాఫీహోటలుకి బయల్దేరాడు కాఫీహోటలులోంచి వస్తూండగా వెంకటేశ్వర్రావు అవుపించేడు !

కొంతదూరం, ఏదో నవ్వుతూ మాట్లాడుతూ, మాట్లాడుతూ అకస్మికంగా తన చిరిగిపోయిన చొక్కావైపు చూపిస్తూ "ఒరేయి యింతవరకు చొక్కాలన్నీ చిరిగిపోయినా బాధపడలేదు కాని, చిరిగిపోయిన వాటినికూడా చాకలాడు పారేస్తున్నాడు అని బాధపడాల్సొస్తోందిరా యిప్పుడు ఏమైనా నీకు పనికిరానివి నాల్గు చొక్కాలు చిరిగిపోయిన వుంటే యిద్దూ' నవ్వుతూ నే చొక్కాలు కుట్టించుకోడానికి డబ్బుని మిగల్చడం ఎంత కష్టమో మినహాయించి మిగతా సంగతులు అనేకం మాట్లాడేస్తున్నాడు

తానాగిపోయి వక్కక్షణం వాడివంక చూసేడు నిజంగానే చొక్కా చాలా దైన్యస్థితిలో వుంది వాడా నవ్వుతూ అడగటం నావంతు కాని, విడమర్చి చెప్పటం నా వంతు మాత్రం కాదుసుమా అన్నట్లు ఏమేమో మాట్లాడుతున్నాడు

ఉన్నాయి తనవద్ద చిరిగిపోయిన చొక్కాలు చాలాను కాని తన మనస్సు చివుక్కుమంది తోటి స్నేహితుడికి చిరిగిపోయిన చొక్కాలు ముష్టాడికిచ్చినట్లు ఎట్లా యివ్వాలో అర్థమయ్యింది కాదు

'బజారు రారా నాతో! రెండు చొక్కాలు చింపిస్తా'

'కొత్తవి తొడుక్కోడానికి మనం ఏమీ తాసీల్దారులం కాములేరోయి ఎవ్వో ఇట్లాగే చిరిగినవే, గుమాస్తాలంతా తొడుక్కోవాలని న్యాయశాసనం తాసీల్దారవనీ కొత్త చొక్కా తొడుగుదాము' నవ్వుకూడాను

తనేమీ చెయల్యేడు వాడికి పాతవి తాను యివ్వలేడు, కొత్తవి వాడు తీసుకోలేడు ఎంతబాధ ! అంత బాధలోనూ వాడు నవ్వే

ఏమయ్యిందో ఆ నవ్వు అతని ముఖమంతా వెతుకుతున్నాడు తనిప్పుడు.

వెంకటేశ్వర్రావు తన ఆలోచనలని పసిగట్టినట్లు తలెత్తి చూచి, పూరికే, నేనేదో ఖూనీచేసినట్లు నన్నట్లా చూడకురా నేను ఒప్పుకుంటున్నా, నేను పూర్తిగా మారిపోయేనని"

తను జాలిపడ్డాడు అతన్ని చూసి బాధపడ్డాడు అతని పరిస్థితి చూసి అతనిలో యీ మార్పుకి ఎంత బాధో! చేపని తీసుకొచ్చి వొడ్డుని విడిచినట్లు అతని మనస్సేనింత పరిస్థితుల్లో ఎట్లా గిజగిజ లాడుతూందో !

పాపం ! అంతా కలిపి 72 యిచ్చేవారు జీతం ఇరవై రూపాయల యింటద్దెపోను, బియ్యానికి 15 రూపాయలు, యితర దినుసులకో 15 చాకలి, మంగలి, పాలవాళ్లకి, పెరుగువాళ్ళకి మరో యిరవైపోను, పెళ్లాం బిడ్డలనీ, తల్లినీ పోషించాలసిన అతనికి చొక్కా కుట్టించుకునే తాహతెట్లా వస్తుందానాడు ఆ జీతంతో, మకిలి కాని అతని చేతులకి కొత్త చొక్కాని పట్టుకునే అర్హత ఎక్కడిదీ అసలు ?

'అవునుకో కన్పిస్తూనే వుంది అయితే ప్రస్తుతం జీతం ఎంత యిస్తున్నారని?'

'ఎంత? 72 కి మూడు రాళ్ళు ఆరు కలుపు' హీనంగా నవ్వేడతను ఆ నవ్వు వెనక అగాధమైన విషాదం

ఒక్క క్షణం ఆగి ఏదో ఆలోచిస్తూ అన్నాడతను

'ఇంకా కొంచెం నీచమైన పన్లున్నాయి తెల్సుగా - అబద్ధాలాడటం, ముఖస్తుతి చెయ్యటం, లంచాలు యివ్వటం, పనిచేస్తున్నట్లు నటించటం యిట్లాంటివి కొన్ని మిగిలిపోయేయి ఇవికూడా యిప్పటినుంచీ అలవాటు చేసుకుంటే యింకో రెండేళ్లలో నేను చిన్న 'కార్'ని భరించగలను ఈసారి నవ్వొస్తే ఆ కార్లోనే మాయింటికి రావడం'

తర్వాత తామేమీ మాట్లాడుకోలేకపోయేరు మాట్లాడుకోడానికి చాలా సిగ్గుపడాల్సిన విషయాలు మిగిలినవన్నీ! మాట్లాడుకోకుండా చెయ్యాల్సినవే మిగిలీనవన్నీ !

అయితే తన కొక్కటే విచిత్రంగా కన్పించింది చిన్నప్పుడూ ముగ్గురూ అనుకునేవారు కారులో ఎక్కి తిరగాలని, కారుని భరించాలని, కారుని 'డ్రైవ్' అయ్యాలని ముగ్గురిలోనూ, తను వక్కడే చెప్పడే కారుని కొనేసి, ప్రస్తుతం దాన్ని తోలుతూ చిరకాల వాంఛని తీర్చుకుంటున్నాడు

వెంకటేశ్వర్రావు, సత్యము కూడా

* * *

తిరిగి వస్తున్నాడు తెనాలలో పని చూసుకుని, తను స్టేషన్‌వైపు వకనాడు మెడికల్ షాపు ముందు చేతిలో చిన్న మందు సీసాతో పధ్నాలుగేళ్ల కుర్రాడు తారసపడ్డాడు వాడు తనవంకే చూస్తూ, 'యిక్కడున్నావేం బాబాయి' అన్నాడు

తనింకా గుర్తుపట్టనేలేదు, ఆ కుర్రాడు గుర్తుపట్టేసేడు తనని ఆలోచనల్లోంచి తేరుకోకముందే వాడనేసేడు 'నేను బాబాయి సత్యం తిమ్మడ్ని'

చాలా ఎదిగేడు కుర్రాడు! చిరిగిన బట్టలతో సన్నగా పూచలా వున్నాడు అడిగేడతను 'సత్యం వద్దనుంచి వుత్తరాలు వస్తున్నాయా' అని

వాడొక్క క్షణంలో గుక్క తిప్పుకోకుండా పెద్ద విషాద గాథని విన్పించేడు. సారాంశం అతని తల్లి చాలా జబ్బుగా వుందని సత్యంవద్దనుంచి రెండు నెలలనుంచి వుత్తరాలే లేవని 'సరే నడు నేనూ వస్తా' అంటూ వాడి వనకాలే నడిచేడతను

సత్యం తల్లి చాలా కృశించిపోయి వుంది తనని గుర్తుపట్టలేకపోయింది తనే చెప్పుకున్నాడు ఫలానా అని

అంత నీరసంలోనూ ఆవేదనంతా వెళ్లబుచ్చుకున్నదా వృద్ధమాత

'సత్యానికి రానేరా పరిస్థితులు యిట్లా వున్నాయని' అడిగేడు తను

'వాడికెందుకు నాయనా యీ గొడవలన్నీ అక్కడ ఏం తింటున్నాడో, లేదో తెలియక నా ప్రాణం కొట్టుకుపోతూంటుంది వాడి అవస్థలు వాడు పడుతున్నాడు కుయ్యిమనకుండా ఈ ఇంటి గొడవలతో వాడి మనస్సును కూడా ఎందుకు పాడుచెయ్యడం ?' చెప్పిందావిడ

'అది కాదమ్మా ఇక్కడ వక్కర్తివీ కుర్రాడితో ఏం అవస్థపడతావు. నువ్వయినా అక్కడికెళ్లి పోరాదూ యీ కొంప అంతా అద్దెకిచ్చేసుకుని - కుర్రాడితో' అన్నాడతను

'ఆ మధ్య సత్యం అదే రాసేడు బాబూ ఇంకా కొన్నాళ్లల్లో తనకేదో ప్రమోషన్ రావచ్చుట ఆ పరీక్షలన్నీ ప్యాసయ్యేడట 'ఏ తాసిల్దారుగానో యీ వైపు ఎక్కడో వేస్తారు అంతా హాయిగా వుండొచ్చు నిన్ను సుఖపెడతా. మన

నపుంసకత్వము ! నరములబలహీనత చేతనూ కామేచ్ఛ, దాంపత్య సుఖానందం లేక దుర్భర జీవితంతో కృంగిపోవుచున్న వారికి నూతన దాంపత్య సుఖానందాన్నిస్తుంది లిమ్‌డా ఆయిల్ (పైపూతకు మాత్రమే) వృద్ధులు కూడా వాడవచ్చును చిన్నబుడ్డి రూ 3-8-0, పెద్దది 5-8-0, పోస్టు ఖర్చులు 0-14-0

ది ఫోటో ఏజన్సీ, 26, బీటు జీ టి మద్రాసు 1

కష్టా లెంతో కాలం వుండవు అమ్మా' అని రాసేడు ఎప్పుడో వొస్తుందా సుదినం కష్టాలు ఎల్లకాలం వుండవు నాయనా! అన్నట్లు నీ కేమైనా పిల్లలా' అడిగిం దామె

పరధ్యానంగానే 'యిద్దరు' అని చెప్పి, ఆమె కష్టాలని గురించి ఆలోచించ సాగేడు తను

'బావుంది! వా డక్కడ ఏం అవస్థలు పడుతూన్నాడో ఏమో ఎప్పుడైనా అటు వెడితే చూసిరా బాబూ! చిన్నప్పటి నుంచీ కలిసి చదువుకున్నారా మీయిద్దరూ ఏదో యీ యింటిమీద వచ్చే అద్దెపైకం 50 రూపాయలు మా యిద్దరి పొట్టలకి చాలుతే చిన్నప్పటినుంచీ ఎంతో గారా బంగా పెరిగేడా యిరి, మా నాయన ఏ కష్టాలు ఎరగడు వాడు పోయేక, పాపం వాడికి అన్నీ అవస్థలే! ఎన్నాళ్లుంటాయిలే యీ కష్టాలు

ఇంకో రెండు మూడేళ్లలో చిన్నాడి చదువుకూడా పూర్తి అవుతుంది అందరం హాయిగా వకే చోట ' ఆయాసంతో కళ్లు మూసుకుంది - ఆమె

కుర్రాడిని అడిగేడు 'మందెవరు యిస్తు న్నార్రా' అని

'హోమియోపతి డాక్టరు - రంగయ్య గారు '

సరే తనిక చేసేదేముంది? లేచి వచ్చే సేడు స్టేషన్‌కి దారిపొడుగునా తన చెవిలో అవే మాటలు గింగురు మంటున్నాయి 'కష్టాలు ప్రమోషన్ గట్టెక్కడం సౌఖ్యం '

మాటలు ఒట్టి మాటలు బరువు లేని మాటలు——నిజంకాలేని మాట లవ్వి తనకి తెలుసు అయినా ఆశలవ్వి!

* * *

సత్యనారాయణ గదికి తాళంవేసి వుంది తను వెళ్లేసరికి సాయంత్రం 6½ గంటల యినా అతనింకా ఏం చేస్తున్నాడో అర్థం అయిందికాదు ప్రక్కగదిలోని వాళ్ల నడి గితే వాళ్లు చెప్పారు, 'యింకా ఆఫీసు లోనే వుంటాడని '

తన సామాన్లు ప్రక్కవాళ్ల గదిలోనే వుంచి తను మౌంట్‌రోడ్డు మొగలో పేవ్ మెంటుమీదకు వచ్చి నిలబడ్డాడు, సిగరట్ వకటి వెలిగించుకుని

మరలోంచి బియ్యం జారినట్లు, 'టర్నిం గు'లోకి కార్లు- రకరకాలవి జారి, మెరిసి, అదృశ్యమయిపోతూన్నాయి ట్రాములతో సమంగా మరోవైపు పార్సీవాళ్లు పరుగు లెత్తుతున్నారు, ఏదో మునిగిపోతూన్నట్లు కనుచూపుమేరలో సత్యం వచ్చే జాడలు అవుపించడం లేదు, ఎక్కడా తనకి

సిటీ న్యూస్ ఏజెంటు షాపులో వక 'యింగ్లీషు వీక్లీ' తీసుకుని, బొమ్మలు చూస్తూ తను అనుకున్నాడు, 'యిదన్నమాట వీడి జీవితం? జీవితంలో మరోకేదీ చెయ్యా ల్సింది లేనట్లు ఏడింటివరకు ఆఫీసు పనే మిటి?'

తన కంళ్లు పత్రికమీదనుంచి మళ్ళీ వక్కసారి ట్రాములమీదకి, కార్లమీదకి జరిగి, ఎదురుంగా వున్న కార్లు నిలిపేచోట ఆగింది సత్యం బీడీ పీలుస్తూ నిలబడ్డి వున్నాడు ఎదురుంగా ఆనందంగా కేకేసి చేతు లూపేడు తను సత్యం యిదేమీ గమ నించడం లేదు అతని దృష్టంతా వంకరలో తిరిగి, మెరిసి, జారిపోతూన్న రంగురంగుల కార్లపైన వుంది స్వంత కారుకోసం నిరీ క్షిస్తున్న వ్యక్తిలా వున్నా డతను అక్కడ! 'ఇది కాదు, ఇది కాదు, ఇది కాదు ' అన్నట్లు అతని కంళ్లు వరసగా వక కార్లు మీదనుంచి మరోదానిమీదకి పాకుతు న్నాయి మృదువుగ

ఉన్నట్లుండి నీరసం వచ్చినట్లు నెమ్మ దిగా ఎలక్ట్రిక్ స్తంభానికి జేర్లబడి, నోట్లోని బీడీని తీసి నేలకు విసిరిపారేసేడు సత్యం చిరిగిపోయిన చొక్కాతో, చెమటకారే ముఖంతో సత్యం యీ ప్రపం చానికి సంబంధించని వ్యక్తిలాగ వున్నా డక్కడ

త్వరితంగా, నేర్పుగా కార్లను, బండ్లను తప్పించుకుని సత్యం దగ్గరకి జేరే డతను సత్యం తన వైపు చూచి కూడా తనని గుర్తించలేకపోయేడు 'ఏరోయ్' అంటూ తను బాగా దగ్గరకి వచ్చేసరికి, బల వంతంగా తెచ్చుకున్నాడు చిరునవ్వుని- అతని పెదాలపైకి ఎందుకో ముఖంలో సిగ్గు వకటి!

'ఏమి టిక్కడ యీ ధ్యానం?' తిన్నగా అడిగే డతను

'ఇక్కడ ఎన్నాళ్లున్నా ఆ కార్లని దాటలేననే అనుమానం! వాటికింద పడ కుండా అవతలకి జేరలేననే భయం! ఏం చేసేది? అయితే ఏమిటి సంగతులు? ఎప్పు డొచ్చేవు' అడిగేడు సత్యం

తన హోదా, తన జీతం, తన వూళ్లోని పరిస్థితులు అన్నీ వివరంగా చెప్పేడు తను, యివతలకువచ్చి వాళ్ల గదివైపు నడుస్తూ, క్రిందటిసారి తను అతని తల్లిని చూడటం, ఆమె ఆశలు అన్నీ చెప్పి, 'అయితే నీ పరి స్థితులు ఎట్లా వున్నాయి?' తను అడిగేడు

సత్యం గది తాళం తీసి, లోపలికి నడుస్తూ 'బాగానే వున్నాయి ఫర్వాలే' దన్నాడు

గదంతా బీడీ ముక్కలతోను, దుమ్ము తోను నిండివుంది నేలమీద వకమూల వక జంబుఖానా పరవబడివుంది తలవైపున తల గడగా నాలుగుజతల చొక్కాలాగులు అమర్చబడి వున్నయి

కుడివైపు వకమూలని వకట్రంకు దాని మీద మూడువరసల పుస్తకాలు! కొన్ని రచనల వ్రాతప్రతులు!

తను హీనంగా నవ్వి పుస్తకాలదగ్గర కూర్చుంటూ, వకవ్రాతప్రతిని చూస్తూ 'మరినాళ్ల సర్వీసు వుంది, ప్రమోషన్ ఏమీ రాలేదూ?' అడిగేడు! ఊ కవిత్వం కూడాను

తర్వాత పుస్తకాలు చూచేడు

అన్నీ ఖరీదైన పుస్తకాలు! ఇదా వీడు చొక్కాలు కూడా కొనుక్కోకుండా, డబ్బుతో చేస్తున్న నిర్వాకం

'ఒచ్చేదే మరి నా కన్న వెనకచేరిన వాళ్లకి కూడా వచ్చింది ఒస్తుంది రేపో మాపో నాకూను' చెప్పేడు సత్యం

'రావాల్సిందే ఇప్ప డేమిస్తున్నా రేంటి?'

'అంతా కలిపి ఎనభయి రెండు'

'పైన ఏమీ?'

'ఛీ! ఛీ!'

'ఏం, మేం అంతా తీసుకోవడం లేదూ?'

తన మాటలు తనకే విచిత్రంగా కన్పించి నయి ఒకనాడు తను యీ ఆచారం నీచ మని వాదించేడు అసహ్యించుకున్నాడు తా నిప్పుడు

పరీక్షలరోజులు గుర్తుకొచ్చినయి తన తండ్రి తనని వెంటబెట్టుకొని 'ఎగ్జామినర్' యింటికి లాక్కెళ్లాడు ఆయనఎదట చిన్న కుర్రాడిలా తన తండ్రి కళ్లనీళ్లు కారుస్తూ తన జీవనాధారాన్ని పాసు చేయించమని వేడుకున్నాడు

ఎగ్జామినర్ చాలా దర్జాగా నవ్వి 'ఏం తెచ్చేవు?' అడిగేడు

తన తండ్రి మామిడిపళ్ల బుట్టని లోపల పెట్టించేడు ఆయన మందహాసం చేసి 'వక వంద రూపాయలుకూడా పట్రా ' ఆ మర్నాడే ఏభయి సెంట్ల భూమిని అమ్మి తన తండ్రి వంద రూపాయలు చెల్లించేడు ఎగ్జామినర్ తను పరీక్ష ప్యాసయ్యేడు!

తన వుద్యోగానికీ అంతే. రెండు వందలు! ఆ మధ్య తన యింటిగోడ పడిపో యింది సిమెంటు దొరకదు 10 బస్తాలు తెచ్చుకోడానికి 50 రూ లు 'ఫీజు!' లేచినదిమొదలు తన కళ్లముందు, ప్రపం

చంలో పైసా చూపనిదే ఏ పనీ జరగటం లేదు మహాసముద్రంలో తను ఎదురీద గలడా! వాలుకి ఈదసాగేడు

ఇదంతా విని సత్యం నవ్వి వూరుకున్నాడు

కాస్సేపు యితర విషయాలు మాట్లాడుకున్నాక భోజనానికి బయటికి నడిచేరు 'నడుస్తూ ఏ హోటలు?' అడిగేడు తను

సత్యం కార్లని జాగ్రత్తగ తప్పించుకుంటూ వకహోటలుముందు ఆగి 'ఇక్కడ చేద్దామా?'

'మీ హోటలు ఏదీ అన్నాను?' అడిగేడు తను మళ్లీ

'ఒక హోటలు ఏమిటి మనకి?'

'మరి నెలవారీభోజనం చెయ్యడం లేదూ?'

'డబ్బులుంటేద్దూ వక్కసారిగ ఎక్కడ పడితే అక్కడే క్రిందటి నెల చేసిన అప్పులు తీర్చేసరికి' వూరుకున్నాడు - సత్యం

'మరి తర్వాత?'

విషాదంగా తనవంక 'చెప్పాలా?' అన్నట్లు చూచేడు గ్రహించేడు తను 'పస్తులు' అన్నమాట!

సత్యం వద్దన్నా వినకండా తను జేబులోంచి డబ్బులు తీసి రెండు భోజనం టిక్కట్లు కొన్నాడు

తిరిగి గదిలోకి వచ్చేక తను చెప్పేడు వాళ్ల అమ్మని తమ్ముణ్ణి తీసుకొచ్చేసి అంతా యిక్కడే కలిసి వుండటం బావుంటుందని!

'నా కోరిక కూడా అదే! నన్నింత పెద్దవాణ్ణి చేసిన అమ్మకి ఏమీ సాయం చేయలేకపోతున్నానే అని ప్రతీక్షణం నా హృదయం మధనపడిపోతూంది ఎప్పుడో నాకు జీతం హెచ్చించక పోరు ప్రమోషన్ రాకపోదు అమ్మని తీసుకొచ్చి సుఖపెట్టకపోను ఇప్పుడు నాతోబాటు వాళ్లూ కష్టపడటమేగాని యిక్కడేం సుఖపడతారు? వస్తాయి మంచిరోజులు'

తానిది భరించలేకపోయేడు. 'చూడు సత్యం మన చిన్ననాటి ఆశయాలూ, ఆదర్శాలు వేరు, యీనాటి జీవితం వేరు ఆ ఆదర్శాలకీ యీనాటి ప్రపంచానికి లంకె వెయ్యలేము ప్రపంచంతోబాటు మనమూ మారాలి, లేకపోతే మన గతి యింతే! ఈ నాడు, న్యాయం, సత్యం, దయ మొదలైన వాటికి స్థానం లేదు అవెక్కడుంటే అక్కడ సర్వనాశనం!'

సత్యం చిత్రంగా తనవైపు చూచేడు

'అవును నువ్వన్న నమ్మవు దయగా సత్యప్రవర్తనతో జీవితం గడపినవాళ్లెవరూ యింతవరకు బాగుపడలేదు లంచాలు తీసుకుని, అబద్ధాలాడి, ఏ ఎండకా గొడుగు పట్టినవాళ్లు మేడలు కట్టుకొని కార్లల్లో వూరేగుతున్నారు ఆత్మగౌరవం చంపుకొని, అన్యాయాలకు వడిగట్టుకున్న వాళ్లు యీనాడు వేదికలెక్కి నీతినిగురించి మహోపన్యాసాలిస్తున్నారు-మహా నాయకులై' వుద్రేకంగా అన్నాడతను

సత్యం బాధగా తన చేతులు పట్టుకుని 'నీకు దణ్ణం పెడతా. ఆ విషయం వదిలెయ్యి'

తనకి జాలేసింది తను మాట్లాడలేకపోయేడు 'నీ యిష్టం మరి నేను వెళ్లి రావాలి బండికి' లేచేడతను ప్రక్కవాళ్ల గదిలోంచి తన సామాను తీసుకుని స్టేషన్‌కు వెళ్ళబోతూండగా ఆ గదిలోని ఆయన 'నేనూ వస్తా సెంట్రలులో కొంచెం పనుంది నాకు' అంటూ ఆయనా వచ్చేడు, తనతో

ఆయనకీ సత్యం ఆఫీసులోనే పని ఆయన తనతో సత్యం గురించి చాలా వింతగా చెప్పేడు సత్యం ముక్కుకు సూటిగా పోతాడట ఏదో వకగుమాస్తా లంచంతిని వంకరత్రోవన పోతోంటే అది తప్పని వీడు పేపరుమీదే 'రిమార్కు' చేస్తాడట మిగతా గుమాస్తాలకి వీడంటే తగని అసహ్యం ముఖ్యంగా హెడ్డుగుమాస్తాకి ఏదో పెర్మిట్లు అక్రమంగా యింకోరికిచ్చేరని వోసారి ఆఫీసర్ మీద కూడా ఎదురు తిరిగేడట-సత్యం

తనకి బాగా అర్థమయ్యింది సత్యం అవస్థ! అందుకనే అతనికి ప్రమోషన్ రాలేదు ప్రమోషన్ సంగతి దేవుడెరుగు వాణ్ణింకా అసలు వుద్యోగంలో వుంచేరు

* * *

మూడేళ్లు గడిచేయి సత్యం సంగతులు ఎప్పటికప్పుడు తెలుస్తూనే వున్నాయి వాళ్లవల్ల వీళ్లవల్ల తన పరిస్థితులు మారేయి, వెంకటేశ్వర్రావు పరిస్థిలు మారేయి వెంకటేశ్వర్రావు సబ్‌కలెక్టర్ అయ్యేడు, ఒక కారు, పాతికఎకరాలు కొన్నాడు. రెండు సొంతకార్లు, ఒక పెద్దమేడ-పర్వాలేదు మద్రాసు ట్రాన్స్‌ఫరు యీ మధ్య, అయిదొందల జీతంమీద! ఇక సత్యం, తమ్ముడు ఎక్కడికో పారిపోయేడుట అది విని అతను తన తల్లిని మద్రాసు పిల్చుకు వచ్చేడట ఎక్కడున్నాడో ఎట్లా వున్నాడో చూడాలని అన్పిస్తుంది తనకి ఎప్పుడైనా!

* * *

చల్లటి సాయంత్రపు గాలిలో తేలేలాగ జారిపోతూంది తన క్రొత్త 'వాక్సాల్' - మౌంట్‌రోడ్డుమీదనుంచి ఎదురుంగావున్న అద్దంలోంచి తన కారు ంటె తక్కువ ఖరీదైనవి, ఆగడం, మెరవడం, మాయవడం కన్పిస్తూంటేను, మనుష్యులు, ట్రాముల్లో సీట్లకోసం తన్నులాడుకోడం కన్పిస్తూంటేను, యితరులకంటె తానెంత అదృష్టవంతుడో జ్ఞప్తికి వస్తూంటుంది.

ఆకస్మికంగా తన కండ్లు 'సిటీ న్యూస్ ఏజెంటు' షాపువైపు తిరిగేయి సత్యం ఆ షాపుముందు బీడిని కాలుస్తూ నిలబడి వున్నట్లు ముందే వూహించుకున్న తనకి, ఎన్నో క్రొత్త ముఖాలు, బాధలతోగూడిన ముఖాలు, గుమాస్తా ముఖాలు అవుపించినయి

కండ్లు రెండు ముందు మిర్రర్‌లోకి తొంగిచూసేయి వెనకనుంచి 'ఆస్టిన్' కుడివైపు ఛర్రున సేర్పుగా వంకర తిరిగేడు తను 'సెంట్రలు'వైపు జారిపోతూంది తన కారు - మెత్తగా!

ఆకస్మికంగా ఎదురుగావున్న అద్దంలో సత్యం కన్పించినట్లయింది తనకి ఎలెక్ట్రిక్ స్తంభంవద్ద, నోట్లో బీడీ ముక్కతో సత్యమే అతను బ్రేక్ వేసేలోగా సత్యం అద్దంలోంచి అదృశ్యమయిపోయేడు

ఆ ఒక్క క్షణంలో అపరిమితమైన అసహ్యంవేసిం దాతనికి సత్యంపైన. న్యాయంకోసం, సత్యంకోసం, నలిగిపోయిన 'సత్యం' ఎంతో పిరికిపందగా కన్పించేడాతనికి కనకనే కారు వెనక్కి త్రిప్పలేకపోయేడు తను తిన్నగా పోసాగింది తన కారు బాధగా మూల్గుతూ!

అరిపోయిన బీడీని విసిరివేసి, ఎలెక్ట్రిక్ సంభాన్ని ఆనుకొని, జారి, మెరసి, అదృశ్యమయి పోయే కార్లని అట్లానే చూస్తూ నిలబడిపోయేడు, చిరుగుల చొక్కాతో అక్కడేవున్న సత్యం! కారు నెక్కలేని గుమాస్తా సత్యం! ★

భర్త: నేను నిన్ను పెళ్లాడేనాటికి నీపేర ఒక్క చింకిపాత కూడా లేదు.

భార్య: ఇప్పుడన్నీ చింకిపాతలే.